# పెన్నేటి కతలు

– రామకృష్ణారెడ్డి

## ఆంకట్ట

ఆంకట్టను జూస్తాంటే దాంట్లో కుండలుగాల్చడం, కుండలుగాల్నాక ఆము తీస్తానే పిల్లోళ్ళందరూ మసి బూసుకుంటా కుండలూ, ముంతలూ గురుగుల్ను కుమ్మర సుబ్బయ్య తాత ఇంట్లోకి మొయ్యడం... అయివన్నీ గ్యాపకమొస్తాయి. బళ్లో నుంచి ఇంటి కొస్తానే కుమ్మర్తాత ఆము పెడ్తావుండాడంటే ఎగుర్లేసేవాళ్ళు. సుబ్బయ్య కోళ్యా కొడుకుతోపాటు ఎండపెట్న పచ్చి కుండల్ను ఆముకాడికిమోస్తే ఆ తాత వాట్ని వొర్సలొర్సలుగా బేర్చుకొనేవాడు. ఆ మొయిన అంతకు ముందు ఏట్లో తిరిగి రాగోలు సీదేసుకొని తెచ్చిన కంపను ఆములో యేసి తొక్కి ఆము కప్పతాడు. కప్పినాంక ముందు దిక్కున దానికి సిన్న వాకిలి బెట్టి దాని గుండా రాగోల్తో కంప దురముతా వుంటాడు. లోపల మంట ఆమంతా రగులుకొంటా వుంటాది.

ఆముకాలేతప్పుడు వాళ్ళ అమ్మగార్లు బువ్వ తిందురాండని పిల్సుతాన్నా పిల్లోళ్ళు ఆన్నుంచి పోనేపోరు. సుబ్బయ్యతాత కంప దురుముతావుండేదీ, ఆములో మంట ఎఱ్ఱగా మండుతావుండేదీ, దానిపైన పెట్టిన సిన్న గవాసిగుండా రేగులు ఎగుర్తా సీకట్లో మినుగురు పురుగులాల ఆడ్తావుండేదీ సూస్తావుంటారు. తాత కోళ్ళు ఎల్లమ్మ, తాతకు ఆడికే బువ్వ తీసుకొస్తాది. మాను బువ్వ తినే తప్పుడు ఆమే కంప ఆములోకి తోస్తాది. మంటలు బాగా అందుకోని లోపలబెట్టిన కంప అంటుకొన్నాక బయటి కంపతో అంతగా పనుండదు. అప్పటికి ఆదలా బాదలా ఇండ్లకు బోయి బువ్వ తినొచ్చిన పిల్లోళ్ళకు మెల్లంగా తాత కతలు జెప్తాడు. మాట మునిగివాగ్గానీ వాళ్ళు ఇండ్లకుబోరు.

రొండ్రోజులయినాక ఆము తీస్తే కుండలు కాల్ను వాసన బలే వుంటాది. ఆము బాగ కాలిందా లేదా అని సుబ్బయ్య తాతను అందరూ యిశారిస్తారు. ఒక్కొక్కసారి పచ్చికంప వుంటేనో, యింగేదన్నా వాటంతప్పతేనో కుండలు బాగా కాలవు, శానా నోటుబడిపోతాయి. ఆము సెడిపోయిందంటే సుబ్బయ్యతాత దిగులుపడ్తాడు, సేసిన కట్టమంతా నేటిదయిపోయింది అనుకొంటావుంటాడు. ఆడోళ్ళకు కానుపు ఎట్టాటిదో, కుమ్మరోనికి ఆము అట్టాటిది అంటావుంటాడు ఆ తాత. అంటే, అంత గండమంట! ఆములో సిన్న కుండలూ, కడవలే గాదు, సారెమీనగాకుండా సేసే వాడలూ, బానలూ, సాయ్యిలూ అట్టాటియీ వుంటాయి. సదురుబట్టే వాడ జెయ్యాల్నంటే మూన్నాలుగు రోజుల పని! అట్టాటియి సెడిపోతే దిగులే గదా మల్లి!

మన్ను సాకం జేసుకోడానికని, మంటిగుంతలో మన్ను తొక్కేది బలే వుంటాది. సుబ్బయ్య తాత కొడుకు సుబ్బరాయుడు సారె తిప్పతాంటే, ఆ తాత సారె మీందవొంగబడి రొండు సేతుల్తో, సాకానికొచ్చిన మన్నును నీళ్ళు జల్లుకొంటా వొత్తుకుంటా, బట్టతో కోసుకుంటా ఆకారం తీర్చుకుంటా వస్తాడు. సారెగెన్నున తిరుగుతా వుంటే దాని మీనుండే సిన్న బద్దిలో కట్టె ఎట్ట యేస్తాడో యిసిత్రమయితాది. కండ్లు నిలిపి యెంతసేపు సూసినా కనపడద్దు, సుబ్బరాయుడు సూడకుండానే కనిపెడ్తాడు. సారె మీంది పని అయినాక సుబ్బయ్య తాత దాన్ని వొళ్లో పెట్టుకోని, సలపతో[5] అడుగు జేసుకోడం, గట్టి పర్చడం జేస్తాడు. అవతల ఆర బెట్టాడు. రొంత ఆర్నాక... కావాల్నసుకుంటే కడవలకో, వాడలకో పూజలు యేస్తాడు. సుబ్బయ్య తాత గుఱ్ఱాలూ, ఏనిగలూ, ఎద్దులూ యిట్టాటి బొమ్మల్ని మాంచి సిత్తారి పన్తో సేస్తాడు.

ఊళ్ళో రొంత పెద్దోళ్ళు పెండ్లి జేసుకొంటే గినా, సుబ్బయ్య తాత దగ్గరికి వాగమల్లె కుండలకు వొచ్చేవాళ్ళు. వాగమల్లె కుండల్ను సెతేకసేతాలంతో సేసేవాడు. అయిరేని కడవకై తేరంగు లేసేవాడు. పెండ్లోళ్ళు ఉల్లెడ పట్టుకోని వాగమల్లె కుండలకు వొచ్చినప్పుడు సుబ్బయ్య తాతకు తాంబూలం యిచ్చి గౌరవం సేసేవాళ్ళు. అప్పుడు తాత నెత్తికి రువ[illegible] సుట్టుకోని, నొసిటికి కుంకం బొట్టు పెట్టుకోని బలేవుండేవాడు.

సుబ్బయ్య తాత నాయిన వాగయ్య కూడా కుమ్మరిపన్లోనూ, వంటల్లోనూ మాంచిపనోడంట. వాగయ్య అయాంలో, ఆయిన కుండనొత్తే పని పట్టుకొంటే, కొడుకు సుబ్బయ్య సారె తిప్పతా వచ్చినాడు. వాగయ్య సేసిన పని సుబ్బయ్య సేతి కొస్తే, సారె తిప్పే పని ఆయిన కొడుకు సుబ్బరాయునికొచ్చింది. అట్నే... పెండ్లివంటల్లో కూడా నాయినలకు కొడుకులు తోడుపడ్తా వచ్చినారు. ఇట్లా ఎన్నో తరాలుగా వొచ్చిన వర్స సుబ్బరాయుని కాడికొచ్చి నిల్సిపోయింది. కాపోదు మట్టి నుంచీ బంగారు తీస్తే, కుమ్మరోడు మట్టినే బంగారు సేస్తాడనే సుబ్బయ్య తాతకు తను సూస్తావుండగానే, బంగారు సేయడమట్టబోనిచ్చి బతుకుతెరువే వుండదని తెలకపోయింది. పెండ్లిండ్లల్లో వంటకు పిల్సకపోతే, పిల్సకపోతే పోయిర్లే నేనూ ముసిలోనైతి, గాడిపొయ్యి వంటలు సేయలేను అనుకొన్నాడు. అదే మట్టితో, అదే పవ్వంతో సేస్తావుండే కుండలు గొనేవాళ్ళే ల్యాకపోయిరి! మట్టి మార్లా, దాని గునం మార్లా మనిసి మారిపోయినాడు! ఊళ్ళో ఎవురింట్లో సూసినా టేలు సామాను! టేలు సామాను మంచిది గాదు, మంటికుండ నాడ్తే నలవ, దాంట్లో నొండిన కూరాకు తింటే ఆరోగ్గెరం అని సెప్పినా యెవురూ యిన్లా. కుమ్మరోని మాన్యం రొండెకరాలేగాక, కొనుక్కొన్న నాలుగెకరాల కోళ్ళసేను గూడా అప్పుల్లోకిపోయింది. సుబ్బయ్య తాత నడుం వొంగిన ముసిలోడైనాడు.

కోళ్యా కొడుకూ సెప్పినా యినకుండా కుండలు సేస్తానేవుంటాడు. గంప తీసుకోని ఏట్లోకి పోయి మన్ను తొగి తెచ్చుకోని, తొక్కి, సారె మీదికెక్కిస్తాడు. సుబ్బరాయుడు సేసేది ల్యాక వచ్చుపడిన సేతుల్తో సారె తిప్పతాడు. అట్టా కుండలు, కడవలు, వాడలు సేసి మిద్దెత్తున బేర్సి వాడు సుబ్బయ్యతాత. బొత్తిగా సేయడానికి వోపిక లేనప్పుడు కుక్కిమంచమేసుకోని బేర్సి పెట్టిన వాటి దిక్కు సూస్తావుంటాడు. ఆంకట్టకాడికి బోయి ఆడకూచ్చోని పుల్ల తీసుకోని కుల్లగిస్తా వుంటాడు.

ఎప్పుడన్నా యేపలాస్తరంగొచ్చినోళ్ళో, టేలు సామాను కొనలేని బీదోళ్ళో కుండో, కడవో అడుగుతే, సుబ్బయ్యతాత అలివిగాని దర సెప్పేవాడు. 'అంతా!' అంటే, కోపగిచ్చుకోని గొనుక్కుంటా, "అంతదైతే టేలుదానికి ఎంత లెక్కిస్తావు. దానికంటే యిది తక్కువ కాదా?" యిట్ట తకరారు పెట్టుకునే వాడు. 'ఆ ముసిలోని కెక్కల్లేని ఆశలే' అని అది గూడా అడగడం మానుకొన్రి. సుబ్బయ్య తాతకు యింగా గుబులెక్కవాయె. కొడుకూ, కోళ్యా గూడా ఆ ముసిలోని సంగతి యిడ్సిపెట్రి. ఒక వాడు కొడుకూ కోడలూ యాదో పనికిపోయి వచ్చి సూసేతలికి... యింగేముంది?

మిద్దెత్తునా బేర్సిపెట్టిన కుండల్నా, కడవల్నన్నిట్నీ కట్టె తీసుకొని మగ్గు మగ్గుగా కొట్టి కుక్కిమంచంలో పడుకోనుండాడు సుబ్బయ్య తాత! కుమ్మరోనికొక ఏటి పని, గుదె కొక పూట పని అయింది! అప్పుడు సుబ్బరాయుడేమన్నాడో, సుబ్బయ్య తాతయేమన్నాడోగానీ యిప్పుడిద్దరూ లేరు. సుబ్బరాయుని కొడుకులు యాదో పనిజేసుకొంటావుంటారు. కుమ్మరి పనిగాదు, అసలు వాళ్ళకు ఆ పనేరాదు.

ఆంకట్ట మాత్రం యింగా అట్టనే వుంది. దాన్దగ్గర కూకోని, సుబ్బయ్యతాత సేసినట్టు పుల్లతో కుల్లగిస్తే ఎంత లోతున కుల్లగిచ్చినా నల్లని మసి వొస్తానే వుంటాది. అంతేగాదు... అది లోతుకు పోనుపోనూ యింగా నల్లగా, మెత్తగా, తడిగా ... సుబ్బయ్య తాత గుండెకాయను సొడిస్తే సిక్కని నెత్తర కక్కుతావున్నెట్టుంటాది.

1. ఆవము వుండే ప్రదేశం 2. ఆవము 3. గవాక్షం 4. అయిదు తూములు 5. కుండ తయారీలో వాడే పరికరం 6. డిజైన్ 7. వర్తులం.